క్లుప్తంగా

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె నోటీసు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

భైంసాటౌన్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు భైంసాలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో కేంద్రప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ వంటి సమస్యలను పరిష్కరించలేదన్నారు. కార్మి కుల హక్కులు హరించేలా ఉన్న నాలుగు కోడ్‌లు తెచ్చిందని, ఇందుకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. సెక్టార్ అధ్యక్షురాలు జయశ్రీ, యూనియన్ అర్బన్ సెక్టార్ కార్యదర్శి సులోచన, శైలజ రేఖ, సవిత, భారతి, శారద, అరుణ సంధ్యారాణి, పద్మ, సునీత పాల్గొన్నారు.

'ఇది ప్రజావ్యతిరేక బడ్జెట్'

ఖానాపూర్: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 2024–25 సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రజలను ఆకర్షించడానికే పెట్టారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య విమర్శించారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు గత దశాబ్ద కాలంగా బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఇది ప్రజావ్యతిరేక బడ్జెట్ అని పేర్కొన్నారు. ఎరువుల సబ్సిడీని బడ్జెట్‌లో 13.2 శాతం తగ్గించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

నర్సరీలపై శ్రద్ధ పెట్టాలి



మొక్కలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్

లక్ష్మణచాంద: నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పొట్టపెల్లి(కే) పంచాయతీ ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామ నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు సిబ్బంది రెండు సార్లు నీళ్లు పట్టాలన్నారు. గ్రామంలోని వీధులన్నీ శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యదర్శి శ్రీనివాస్, ఎఫ్ఏ శ్రీనివాస్ ఉన్నారు.

వైద్యం కోసం చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లికి చెందిన ఈదుల్ల మల్లేశ్ గత ఆరు నెలలుగా వెన్నుపూస, లివర్ సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకునే స్థోమత లేదు. ఆపన్న హస్తం కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. గ్రామానికి చెందిన తిరుమలేశ్, గోపాల్ సహా వివిధ గ్రామాల నుంచి దాతల నుంచి సేకరించిన రూ.55 వేల విరాళాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. సాయం చేయాలనుకునేవారు 80961 66915, 93903 35769 ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్లలో విరాళాలు అందించాలని కుటుంబీకులు కోరారు.

సూక్ష్మ నీటిసేద్యం పరికరాలు పంపిణీ



గొర్రెల పెంపకం దారులకు నెట్లు అందిస్తున్న ఎంపీడీవో

పెంబి: సీఆర్డీ ఫౌండేషన్, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు సూక్ష్మ నీటిసేద్యం పరికరాలు, మేకల పెంపకదారులకు షెడ్‌కు అవసరమయ్యే నెట్‌లు, కుట్టుశిక్షణ పొందిన యువతులకు మిషన్లను ఎంపీడీవో సుధాకర్ అందజేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైక్రో ఇరిగేషన్ యూనిట్ల వినియోగాన్ని ప్రోత్సహించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఏఈవోలు రాజ్‌కుమార్, గంగాజల, ఐకేపీ సీసీ వీణ, రైతులు ఉన్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు

- పొంచి ఉన్న ముప్పు
- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- కొన్నిచోట్ల తక్కువ ఎత్తులో..
- పట్టించుకోని అధికారులు

భైంసారూరల్: గ్రామాల్లో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్నిచోట్ల తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రోడ్లు, కూడళ్లలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. చుట్టూ ఏర్పాటు చేయని కంచెలు, చాలాచోట్ల దిమ్మెలు లేకుండా ఏర్పాటు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో చాలాచోట్ల స్తంభాలు నేలకొరుగుతున్నాయి. ఎక్కడికక్కడ శిథిలదశకు చేరిన స్తంభాలే దర్శనమిస్తున్నాయి. దీంతో ఎప్పుడేం ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలోని మాటేగాం, దేగాం గ్రామాల్లో ప్రధాన దారిలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నాయి. తక్కువ ఎత్తులో ఉండడంతో గతంలో పశువులు షార్ట్ సర్క్యూట్‌తో మృతువాతపడ్డాయి. సిరాలలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేదు. దాని పక్కనుంచే పిల్లలు బడికి వెళ్తున్నారు. చుచుంద్ గ్రామంలోకి వెళ్లేదారిలో తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. కోతల్‌గాంలోని ప్రధాన రోడ్డుపై ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఆవు మృతిచెందింది. ఇలాతరచూ షార్ట్ సర్క్యూట్ బారినపడి గేదెలు, ఆవులు మృత్యువాత పడుతున్నాయి.

పంట పొలాల్లో..



మాటేగాంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



ఖథ్‌గాం శివారులో వంగిన విద్యుత్ స్తంభాలు



దేగాంలో ప్రధాన రోడ్డుపై కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

ఇలేగాం, మాంజ్రి, గుండేగాం, వాడి, చుచుంద్, పాంగ్రి, ఖథ్‌గాం, కామోల్ శివారుల్లో వేలాడుతున్న తీగలు సరిచేయాలని రైతులు గతంలో ఇచ్చిన విన్నపాలు బుట్టదాఖలయ్యాయి. మాంజ్రి, పాంగ్రి గ్రామాల శివారులో స్తంభాలు కిందికి వంగిపోయాయి. మహాగాం, గుండేగాం, కోతల్‌గాం, చింతల్‌బోరి గ్రామాల్లో స్తంభాలు వంగిపోయాయి. బలమైన గాలులు వీస్తే ఇవి నేలకొరిగే ప్రమాదం ఉంది. వేసవి ఆరంభానికి ముందే సరిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం

గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూస్తాం. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చర్యలు చేపడుతాం. సమస్య అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారు.

– రాంబాబు, విద్యుత్ ఏఈ

'కంచె'తో పొంచి ఉన్న ప్రమాదం

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా మక్క సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటకు అడవిపందుల బెడద అధికంగా ఉంటుంది. రాత్రివేళల్లో పంట చేలలో చేరి నాశనం చేస్తుంటాయి. దీంతో రైతులు పంట రక్షణ కోసం పడరాని పాట్లు పడుతుంటారు. రాత్రివేళ పంటల వద్దే కావలా ఉంటుంటారు. కొందరు పంట చుట్టూ పాత చీరలు కట్టగా, మరికొందరు రక్షణ కంచె, ఇంకొందరు సోలార్ ఫెన్సింగ్ వేసుకుంటుండగా, ఇంకా పలువురు విద్యుత్ కంచెలు వేస్తున్నారు. దీంతో అటవీ జంతువులతోపాటు ప్రమాదవశాత్తు మనుషులు సైతం విద్యుత్ కంచెను గమనించక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. అలాగే మూగజీవాలు మేత కోసం వెళ్లినప్పుడు సైతం ప్రమాదాల బారినపడే అవకాశముంది. సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నదని చాలామంది రైతులు చవకగా ఏర్పాటయ్యే విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పంట రక్షణ మాటేమోగానీ, గమనించక పలువురు రైతులు మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. పంట రక్షణ కోసం విద్యుత్ కంచె బదులుగా, సోలార్ ఫెన్సింగ్ వేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.



వాలేగాంలో ఇటీవల పంటరక్షణ కోసం వేసిన విద్యుత్ కంచెను తొలగించిన అధికారులు

- కుంటాల మండలంలోని గొల్లమాడలో గత డిసెంబర్‌లో లక్ష్మయ్య అనే రైతు పంట రక్షణ కోసం వేసిన విద్యుత్ కంచె తగిలి మృతిచెందారు. పంట రక్షణ కోసం వేసిన విద్యుత్ కంచెకు ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు.
- భైంసా మండలం సుంక్లి గ్రామంలో ఓ రైతు తన పంట రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కంచెకు తగిలి ప్రమాదవశాత్తు ప్రాణాలొదిలాడు.

విద్యుత్ కంచెలు వద్దు

డివిజన్ పరిధిలో కొందరు రైతులు పంట రక్షణ కోసం విద్యుత్ రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అటవీ జంతువులతోపాటు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. పలువురు రైతులు గమనించక మృత్యువాత పడుతున్నారు. సోలార్ కంచెలు ఏర్పాటు చేసుకుంటే ఎవరికి ఎలాంటి ప్రాణహాని ఉండదు. అటవీ జంతువుల బెడద కూడా ఉండదు.

– ఆదిత్య, ఏడీఈ, భైంసా

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ రాథోడ్ అమృత

మామడ: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల్లో సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీపీ రాథోడ్ అమృత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీటీసీ బొజ్జ రాధ మాట్లాడుతూ అనంతపేట్ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని కోరారు. మామడలోని ఆస్పత్రి స్టాప్ వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని సభా దృష్టికితెచ్చారు. బస్సు సర్వీస్ పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు. రైతుబంధు నగదు, పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బంది పడుతున్నారని వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి అన్నారు. పొన్కల్‌లో ఇనుప స్తంభాలు తుప్పుపట్టి దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారని ప్రత్యేక అధికారి రమేశ్ సభాదృష్టికి తెచ్చారు. త్వరలో సమస్య పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. సమావేశంలో డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవో రమేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అమృత

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కె.మల్లికార్జున్‌రెడ్డి సూచించారు. పార్టీ పిలుపు మేరకు 'గావ్ చలో బస్తీ చలో'కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేలా కృషిచేయాలన్నారు. నాయకులు రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్, శ్రీనివాస్, సత్యవతి తదితరులు ఉన్నారు.

కుంటాల: గావ్ చలో అభియాన్‌లో భాగంగా కుంటాలలో శనివారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తలతో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు. మండల కన్వీనర్ రావు గుద్దేటి నర్సయ్య, ఎంపీపీ అప్క గజ్జరారాం యాదవ్, వైస్ ఎంపీపీ మౌనిక నవీన్, ఎంపీటీసీ రవి, జిల్లా కోశాధికారి లక్ష్మణ్ పటేల్ పాల్గొన్నారు.

మామడ: బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం గావ్‌చలో బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడారు. కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పార్టీ మండల ఇన్‌చార్జి కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి లింగారెడ్డి పాల్గొన్నారు.

పెంబి: పార్లమెంట్ ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న అన్నారు. మండల కేంద్రంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమాలపై జరిగిన బూత్ స్థాయి అధ్యక్షులు, ప్రవాసీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సదాశివ్, గావ్‌చలో అభియాన్ మండల కన్వీనర్ వెంకటేశ్, కోకన్వీనర్ నాగారాజు, జనరల్ సెక్రటరీ నర్సయ్య, బూత్ అధ్యక్షులు ఉన్నారు.



కుంటాల: మాట్లాడుతున్న సామ రాజేశ్వర్‌రెడ్డి

భైంసా: కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ కోరారు. శనివారం బాసరలో గావ్‌చలో అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు.

లోకేశ్వరం: కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. మండల కేంద్రంలోని నారాయణ మెమోరియల్ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన గావ్ చలో అభియాన్‌లో పాల్గొన్నారు. నాయకులు నల్ల రమేశ్, సుమన్ కుమార్, జయసాగర్‌రావు ఉన్నారు.

సీఐకి సన్మానం

ముధోల్: ముధోల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మల్లేశ్‌ను మాజీ జెడ్పీటీసీ లక్ష్మీనర్సాగౌడ్, మాజీ సర్పంచులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల అదుపునకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మాజీ సర్పంచులు నరేందర్‌రాథోడ్, దత్తు, నాయకులు రామ్‌చందర్, నిమ్మ పోతన్న, శ్యామ్‌రావ్, మాధవ్‌రావ్, ప్రవీణ్, సాయిలు, యాదాతగౌడ్, పోశెట్టి, భోజన్న, శ్రీధర్, గంగాధర్, సయ్యాజీ, ప్రవీణ్‌పాటిల్ ఉన్నారు.

'విపత్తులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి'

భైంసాటౌన్: ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు సరైన అవగాహనతో వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పదో బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ బృందం కమాండర్ ఇన్‌స్పెక్టర్ పింటు నంది అన్నారు. పట్టణంలోని ఆటోనగర్‌లో వికాస్ హైస్కూల్‌లో విద్యార్థులకు బృంద సభ్యులు విపత్తులు, ఎదుర్కొనే విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు పలు విపత్తులు–నిర్వహణపై అవగాహన కల్పించారు. వరదలు, భూకంపాలు, రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు వ్యవహరించాల్సిన తీరుపై వివరించారు. అకస్మాత్తుగా గుండెపోటు సంభవిస్తే తక్షణ చర్యగా చేపట్టాల్సిన సీపీఆర్ విధానంపై విద్యార్థులకు ప్రత్యక్షంగా కృత్యాలతో వివరించారు. కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ బృంద సభ్యులు ప్రతాప్‌సింగ్, వాగ్ సంతోష్, అనిల్, మహ్మద్ గౌస్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు, తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, పాల్గొన్న ఏఎస్పీ, ఆర్డీవో

సంక్షిప్తంగా

విద్యార్థులకు అవగాహన

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటివేషన్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్‌ఆచార్య, తిరుపతి, ఎస్సై సాయికిరణ్, ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, చైర్మన్ భీంరావుదేశాయ్, డైరెక్టర్ పోతన్న యాదవ్, గీర్వాణీ విద్యా సంస్థల డైరెక్టర్ బాలానంద్ దేశాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ప్రవేశపరీక్ష

సోన్: మండలంలోని పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమలత ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు ముందుగా చేరుకోవాలని సూచించారు.

ఘనంగా భీరయ్య దేవుని ఉత్సవాలు

ఖానాపూర్: పట్టణంలోని భీరయ్య దేవుని ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బీరప్ప కామరాతి దేవతల కల్యాణ మహోత్సవంలో భాగంగా పట్టణంలోని కుర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం గంగ బోనంతో భక్తిశ్రద్ధల మధ్య ఊరేగింపు నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గంగబోనాన్ని సమర్పించారు.

వైభవంగా పల్లకి సేవ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని దేవరకోట శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయకమిటీ చైర్మన్ ఆమెడ శ్రీధర్, కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణ పనులు నిలిపివేత

సర్సాపూర్(జి): గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా మండల కేంద్రంలో నిర్మిస్తున్న భవన పనులను ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి నిలిపివేశారు. యజమానికి శనివారం నోటీసులు జారీ చేశారు. 2018 పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో భవన పనులు చేపడితే పంచాయతీ అనుమతి తీసుకోవాలని సూచించారు. లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లా సదస్సు జయప్రదం చేయండి

కడెం: ఈనెల 6న నిర్వహించనున్న ఆల్ ట్రేడ్ యూనియన్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. మండల కేంద్రంలో కార్మికులతో కలిసి శనివారం కరపత్రాలను విడుదల చేశారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం తీరుకు నిరసనగ జిల్లా, మండల కేంద్రాల్లో 16న కార్మిక ప్రదర్శన, ధర్నా కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి లింగన్న, గోవింద్, గంగాధర్, గంగవ్వ, లక్ష్మి పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలపై అవగాహన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో సాధారణ ప్రసవాలపై ఏఎన్ఎం సుగణ గర్భిణులకు అవగాహన కల్పించారు. శనివారం ఆమె ఇంటింటికి తిరుగుతూ గర్భిణుల ఆరోగ్యం ఆరా తీశారు. సాధారణ ప్రసవాల వల్ల తల్లీబిడ్డలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రసవాల కోసం ప్రభుత్వ ఆసుత్రులకు వెళ్లాలన్నారు.

జాతీయస్థాయి కరాటేపోటీల్లో పతకం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఆల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాల విద్యార్థి సమన్యు మంచిర్యాలలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి శనివారం ఆ విద్యార్థిని అభినందించారు.

సామాజిక చైతన్య ప్రతీక సాంఘికశాస్త్రం

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: మానవ జీవితం సమాజంతో ముడిపడి ఉందని, సమాజంలో భాగంగా వ్యవహరించే తీరును సాంఘిక శాస్త్రం తెలుపుతుందని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ సౌజన్యంతో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ శనివారం నిర్వహించారు. డీఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో సాంఘిక శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సాంఘిక శాస్త్రానికి, కరెంట్ అఫైర్స్‌కు అవినాభావ సంబంధం ఉందన్నారు. సాంఘిక శాస్త్ర ఫోరం జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. పాల్గొన్న విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో సైతం ప్రతిభ కనబర్చి జిల్లా పేరు నిలబెట్టాలని కోరారు. అనంతరం సంఘం క్యాలెండర్లను విడుదల చేశారు. ఇందులో డాక్టర్ ప్రమోద్‌చంద్రారెడ్డి, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రశంసపత్రం అందుకున్న విద్యార్థులతో డీఈవో

సర్పంచులకు సన్మానం



దిలావర్‌పూర్ మండలం మాడేగాం గ్రామంలో సన్మానం పొందిన సర్పంచులు



తానూరు: సన్మానిస్తున్న గ్రామస్తులు, నాయకులు

పెంబి: ఎంపీడీవో సమావేశ కార్యాలయంలో అన్ని గ్రామాల సర్పంచులను శనివారం సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు, మాజీ సర్పంచులు, కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్: సింగాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ రామకృష్ణ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను గ్రామస్తులు శనివారం సన్మానించారు.

దిలావర్‌పూర్: మాడేగాం పంచాయతీ ఆవరణలో శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సర్పంచ్ సరిత, ఉప సర్పంచ్ జాదవ్ మారుతీ పాటిల్, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులను సన్మానించారు. ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏవో ప్రవంతి, కార్యదర్శి పాల్గొన్నారు.

తానూరు: కోలూరులో మాజీ సర్పంచ్ కాంతుల చంద్రకళ, ఉప సర్పంచ్ యోగేశ్‌తో పాటు వార్డు మెంబర్లను గ్రామస్తులు సన్మానించారు. ఎంపీటీసీ సభ్యురాలు పద్మాబయి, పంచాయతీ కార్యదర్శి సోమ సాహెందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్ పటేల్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

దిలావర్‌పూర్: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్సై యాసిర్ అరాఫత్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం వాహన, ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దన్నారు. మండల పరిధిలోని జాతీయ రహదారితోపాటు అంతర్గతంగా ఇటీవల చోటుచేసుకున్న పలు రోడ్డు ప్రమాదాలను ఆయన వివరించారు. తాగిన మత్తులో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ విధిగా ధరించాలని పేర్కొన్నారు. వాహనాల ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ విధిగా ఉండాలన్నారు. స్థానిక పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

తానూరు: రోడ్డు నిబంధనలు అందరూ పాటించాలని ఎస్సై సందీప్ అన్నారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు శనివారం అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెక్‌ముకి పోటీలకు ఎంపిక

కుభీర్: జిల్లాస్థాయి చెక్‌ముకి పోటీల్లో కుభీర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నిర్మల్‌లో శనివారం జరిగిన ఈ పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జె.సాయన్న తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో అక్షయ, ఎ.పవన్, ధనుశ్రీ నిలిచారని పేర్కొన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి అభినందించి వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు వీరిని అభినందించారు.

ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

కుంటాల: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలో కుంటాల ఆదర్శ పాఠశాలకు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులు శరత్, రుతిక , వినాయక్, విష్ణువర్ధన్ బహుమతులు గెలుచుకున్నారు. డీఈవో రవీందర్ రెడ్డి వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌ప్రసాద్ ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

దస్తురాబాద్: విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని ఖానాపూర్ సివిల్ జడ్జి జితిన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, క్యాల్కులేటర్స్, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు వెంకట మహీంద్ర, రాజలింగం, రాజశేఖర్, పరమేశ్వర్, చంద్రకాంత్, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.